క్లుప్తంగా

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత



జిల్లాస్థాయికి ఎంపికైన అర్ధవరం హైస్కూలు విద్యార్థులు

గణపవరం: విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు ఆటలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఈవోలు పుచ్చల శేషు, గొర్రెల బాలయ్య అన్నారు. గణపవరం మండలం గణపవరం, అర్ధవరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి వివిధ విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం వారు అభినందించారు. ఇటీవల నిర్వహించిన మండలస్థాయి పోటీల నుంచి నియోజకవర్గ స్థాయికి, అక్కడి నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఈ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరంతా రాష్ట్ర స్థాయిలో రాణించాలన్న ఆకాంక్షను హెచ్ఎంలు వ్యక్తం చేశారు.

గణపవరం విద్యార్థులు: ఎం. అభినయ (అండర్-17 కబడ్డీ జిల్లా స్థాయికి), కె.అఖిల్‌కుమార్, కె.మహేష్‌కుమార్ సోదరులు (అండర్-14 షటిల్), ఆర్.తేజశ్రీనివాసరెడ్డి (అండర్-17 కబడ్డీ), ఎ.యశోదకృష్ణ (1500 మీటర్ల రన్నింగ్), ఎ.లోహిత్‌పవన్ (అండర్-17 కబడ్డీ) పి.రామ్‌చరణ్ (అండర్-14 కబడ్డీ), ఎం.ప్రవీణ్ (అండర్-17 కబడ్డీ) ఎంపికయ్యారని హైస్కూలు పీడీ ఎం.పద్మావతి తెలిపారు.

అర్ధవరం హైస్కూలు విద్యార్థులు: పి.యహోషువా (అండర్-17 కబడ్డీ), సీహెచ్.నాగపార్థు (అండర్-17 వాలీబాల్), ఎస్.వంశీ, వికాస్ బాబు, కె.సతీష్ (అండర్-17 ఖోఖో), హేమంతసాయి (అండర్-17 ఖోఖో బాలికలు), ఎన్.నాగలక్ష్మి, మణికుమారి (అండర్-17 కబడ్డీ) పోటీలలో జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పీడీ తెలిపారు.

నియోజకవర్గ స్థాయి ఎంపికలు

ఉంగుటూరు: నారాయణపురం హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఎంపికలలో నియోజకవర్గంలోని భీమడోలు, గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల విద్యార్థులు హాజరయ్యారు. ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్ అంశాల్లో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికల నియోజకవర్గ స్థాయిలో ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన బాలబాలికలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు.

ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టాలి

గణపవరం: ఆయకట్టులోని రైతులంతా ఒకేసారి సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితేనే ఫలితం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ అన్నారు. మంగళవారం గణపవరం మండలం ముప్పర్తిపాడు రైతు భరోసా కేంద్రం వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు సర్పంచ్ కర్రి రాధాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి శ్రీనివాసరెడ్డి ఎలుకల మందు పంపిణీ చేశారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ఏలూరు టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆరోగ్య పరిస్థితి తెలియజేయాలని ఏలూరు 29వ డివిజన్ ఇన్‌చార్జి సన్నీ చైతన్య కోరారు. ఏలూరు టైటస్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని తాపీ మేస్త్రీ కాలనీలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ ఉచితంగా మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్యవంతమైన సమాజం కోసం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఇంటింటా సర్వే చేపట్టారని చెప్పారు. సర్వేలో కుటుంబంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తే, వాటికి అనుగుణంగా ఈనెల 30 నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. కంటి, దంత సమస్యలు, షుగర్, బీపీ, హిమోగ్లోబిన్, డెంగీ, మలేరియా పరీక్షలు, గర్భిణుల ఆరోగ్య సమస్యలు, వ్యాధి నిరోధక టీకాలు, దీర్ఘకాలిక వ్యాధులు ఇలా అనేక రకాల వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిత, మలేరియా అధికారి గోవిందరావు, ఆరోగ్య కార్యకర్తలు సుహానా, వెంకటలక్ష్మి, బర్రె జ్యోతి, రసూల్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మూడో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కన్వీనర్ కోటాలో ప్రవేశం పొందిన విద్యార్థులకు మాత్రమే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి సదుపాయాలకు అర్హత ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు విద్యార్థులకు సూచించారు.

విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపర్చాలి

భీమడోలు: విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని మెరుగుపర్చేందుకు సరైన విద్యా బోధన అందించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ (టెరల్) జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ రాజు అన్నారు. పూళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు అభ్యసన స్థాయిని మెరుగుపర్చడం, విద్యార్థులు తప్పులు లేకుండా పదాలు రాయడం వంటి వాటితో పాటు పలు అంశాలపై నాయకత్వ లక్షణాలపై శిక్షణ తరగతుల్లో టీచర్లు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ భువనేశ్వరరావు పర్యవేక్షణలో రిసోర్స్‌పర్సన్లుగా ఎం.కనకారావు, కె.వెంకటేష్ ప్రధానోపాధ్యాయులు, టీచర్లకు శిక్షణ అందించారు. కాంప్లెక్స్ చైర్మన్ భువనేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని, ప్రతి ఒక్కరూ విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించే విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి చేస్తున్న విశేష కృషికి తగిన విధంగా ఉపాధ్యాయులు చక్కని విద్యాబోధన అందించి ఉత్తమ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దాలన్నారు. టీచర్ ఎం.సుధాకర్ కాంప్లెక్స్‌ను నడిపించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలభాస్కర్, టీచర్ సీతారామయ్య, సీఆర్ఎంటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పూళ్లలో స్కూలు కాంప్లెక్స్ సమావేశంలో టీచర్లకు శిక్షణ అందిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ సీహెచ్ రాజు, హెచ్ఎం జి.బాలభాస్కర్



మాట్లాడుతున్న తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారి రవీంద్రభారతి

విద్యార్థుల స్థాయికి తగిన బోధన చేయాలి

ఉంగుటూరు: ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయికి దిగి విద్యాబోధన చేయాలని తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారి రవీంద్రభారతి అన్నారు. మంగళవారం ఉంగుటూరు, కైకరం కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసన ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పథకాలను విద్యార్థులు సౌకర్యవంతంగా వినియోగించుకునేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. వర్క్ బుక్స్ దిద్దడం, సిలబస్ వారీగా పాఠ్యాంశాలు బోధన, జరగబోయే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడం వంటి అంశాలపై ప్రతి ఉపాధ్యాయుడు శ్రద్ధ వహించాలన్నారు. ఉంగుటూరు హైస్కూల్లో నిర్వహించిన కాంప్లెక్స్ శిక్షణ సమావేశంలో రవీంద్రభారతి పాల్గొని ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనా సామగ్రిని ఆమె పరిశీలించారు. ఎంఈవో -2 కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయంలో శ్రావణ నక్షత్రం పూజలు



గుండుగొలనులో స్వామి వారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

భీమడోలు: భీమడోలులో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ మాసం శ్రవణం నక్షత్రంను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు, వైసీపీ నేత వగ్వాల అచ్యుతరామారావు ఆధ్వర్యంలో స్వామి వారికి పాలాభిషేక పూజలు, శాంతి హోమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు, సాయి పవన్ ఆచార్యులు శాస్త్రోక్తంగా పూజలు చేసారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, లోక కల్యాణార్థం ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో డి.శంకరరావు, పెద్దలు నీలంశెట్టి రాంబాబు, వీర్రాజు, సతీష్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఆరోగ్య భద్రత



గణపవరంలో ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్యాధికారులు



ఉంగుటూరు: తిమ్మయ్యపాలెంలో సర్వే నిర్వహిస్తున్న వైద్యాధికారులు

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తాడేపల్లిగూడెం సబ్‌డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు, పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం సచివాలయాలు 2, 3 పరిధిలో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ఆరోగ్య సమస్యల అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అందరికీ వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారిని పెద్దాస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందిస్తారన్నారు. ఈనెల 30న గణపవరం-2 సచివాలయం పరిధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, ఆరోగ్య సమస్యలున్న వారు ఈశిబిరంలో వైద్యసేవలు పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మయ్యపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ఉంగుటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం తిమ్మయ్యపాలెంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంపై వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో ఆంజనేయబాబు, పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణరెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాలి



పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ

పెదవేగి : ఆడిట్ వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాలని డీఎల్పీఓ కే పూర్ణచంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడిట్ నమోదు ఆన్‌లైన్లో చేయడం వల్ల ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సూచించారు. అక్టోబర్ నెల 31వ తేదీ లోపు అన్ని సచివాలయాల్లో ఆన్‌లైన్ ఆడిట్ నిర్వహణ తప్పనిసరిగా పూర్తి చేయాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీఆర్ మనోజ్, సీనియర్ ఆడిటర్ దిలీప్, ఈఓపీఆర్ డి. శ్రీనివాస్, మండల పరిషత్ ఏవో కె.విక్టర్ జాన్సన్, కార్యదర్శులు ప్రసాద్, రాణి, సాయి కృష్ణ, జితేంద్ర, రామచంద్ర రావు, బాబ్జి, కిషోర్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరు పర్యటన

గణపవరం: గణపవరం మండలం అప్పనపేటలో ఈనెల 27వ తేదీ బుధవారం నిర్వహించనున్న పొలంబడి కార్యక్రమంలో కలెక్టరు ప్రశాంతి పాల్గొంటారని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. రైతులు అనుసరిస్తున్న విధానాలు, పొలంబడి కార్యక్రమం ద్వారా రైతులకు అందుతున్న సేవలను ఆమె పరిశీలిస్తారని ఆయన తెలిపారు. రైతులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం

భీమడోలు: అంగన్‌వాడీ సిబ్బంది న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ మంగళవారం భీమడోలు మండల అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసారు. అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెంచాలని, ఉద్యోగ బాధ్యతలతో సతమతమవుతున్నామని, పనికి తగ్గ వేతనం ఇచ్చి తమను ఆదుకోవాలని వారు కోరారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ ఇందిరాగాంధీకి అందజేసారు. అసోసియేషన్ నాయకురాలు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో ప్రతి పథకం అవినీతిమయం

- ఫైబర్ గ్రిడ్‌లో అవినీతి ఆశ్చర్యపరిచింది
- అసెంబ్లీలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఒకపక్క చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 వంటి అద్భుతాలతో మన దేశం అంతర్జాతీయ ఖ్యాతి గడిస్తున్న తరుణంలో చంద్రబాబు హయాంలో జరిగిన స్కామ్‌లు రోజుకొకటి బయటపడుతున్నాయని, దీంతో ప్రజలు నివ్వెరపోతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ప్రతి పథకాన్ని అవినీతి మయంగా మార్చారన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల సీఎం అనుభవాలను స్కామ్‌లు చేయడానికి వాడినట్టు తెలుస్తోందని చెప్పారు. ఫైబర్ గ్రిడ్ స్కామ్‌ను చూస్తే ఇది నిజమని అనిపిస్తోందన్నారు. ఫైబర్ గ్రిడ్‌లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ వేస్తూ పేదలకు అత్యాధునిక సాంకేతికత సాయంతో టీవీ, కంప్యూటర్, టెలిఫోన్ వంటి సౌకర్యాలు అందించడం లక్ష్యమని, ఈ టెండర్‌లో ఐదు కంపెనీలు పాల్గొంటే టెరా స్టాఫ్ కంపెనీని మాత్రమే ఎంపిక చేశారని వివరించారు. ఇది గతంలో పౌర సరఫరాల శాఖకు నాసిరకం సరుకు సరఫరా చేసి బ్లాక్ లిస్ట్ అయిన కంపెనీ అని చెప్పారు. ఆ కంపెనీ ఎండీ వేమూరి హరిప్రసాద్ ఈవీఎం దొంగతనం కేసులో ప్రధాన ముద్దాయి అని వివరించారు. అసలు టెండర్‌లో పాల్గొనడానికి అర్హత లేని కంపెనీని టెండర్ గ్రిడ్ ఓపెన్ చేసే ముందురోజు బ్లాక్ లిస్టులోంచి చంద్రబాబు తీయించారన్నారు. ఆ కంపెనీ అందించిన డాక్యుమెంట్లు కల్పితమైనవని, అర్హతలు సరైనవి కావని చెప్పి నివేదిక ఇచ్చిన ఉన్నతాధికారి సుందర్‌ను వెంటనే బదిలీ చేయించారని చెప్పారు. వేమూరి ప్రసాద్ అనే వ్యక్తిని టెక్నికల్ కమిటీ, టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీలోనూ చంద్రబాబు నియమించారన్నారు. ఇలాంటి కంపెనీకి రూ.284 కోట్లు ఇచ్చి పని చేయిస్తే నాణ్యత ఎక్కడ ఉంటుందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ పనుల్లో నిర్దిష్టమైన లెక్క ప్రకారం స్తంభాలు పాతకుండా టెండర్లలో పేర్కొన కేబుళ్లు, పరికరాలు పెట్టకుండా రూ.114 కోట్ల ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసినట్టు తేలిందన్నారు. ఫైబర్ గ్రిడ్ స్కామ్ మొదటి నుంచి మోసమేనని, తప్పకుండా దర్యాప్తు సంస్థలు విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటాయని తెలిపారు. ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును చంద్రబాబు సుపుత్రుడు లోకేశ్ అవినీతి గ్రిడ్‌గా మార్చేశారన్నారు. ఫైబర్ గ్రిడ్‌లో జరిగిన మోసాలకు ఇది ట్రయల్ మాత్రమేనని, ఇంకా సంచలన నిజాలు బయటకు వస్తాయని స్పష్టం చేశారు. లోకేశ్ స్టాన్‌ఫోర్డ్‌లో చదివి దొంగ ఒప్పందాలు ఎలా చేయాలి, నిధులు ఎలా కొట్టేయాలి, షెల్ కంపెనీలు ఎలా పెట్టాలి, ఒక కంపెనీని బ్లాక్ లిస్టులో ఎలా పెట్టాలి, అందులో నుంచి బయటకు ఎలా తీసుకురావాలి అన్నది మాత్రమే నేర్చుకున్నాడని ఎమ్మెల్యే కొఠారు అన్నారు.

గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమడోలు: మండలంలో ఖాళీగా ఉన్న 4 గ్రామ వలంటీర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి అన్నారు. భీమడోలులో మంగళవారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేసారు. మండలంలోని అంబర్‌పేటలో 2, పోలసానిపల్లి, సూరప్పగూడెం గ్రామాల్లో ఒకొక్కటి చొప్పున రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అంబర్‌పేటలోని రెండు పోస్టుల్లో బీసీఏ (జనరల్), బీసీ బీ (జనరల్), పోలసానిపల్లిలో పోస్టును ఓసీ జనరల్‌కు, సూరప్పగూడెంలోని పోస్టును బీసీఏ జనరల్‌కు కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్ల నిండి 35 ఏళ్ల నిండాలన్నారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

టీడీపీ పాలనలో వైద్య రంగానికి అనారోగ్యం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

గణపవరం: దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలో పేదలకు ఎంతగానో ఉపయోగపడిన వైద్యరంగం గత ఐదేళ్ల తెలుగుదేశం పాలనలో తీవ్ర అనారోగ్యానికి గురైందని, మళ్లీ వైఎస్ జగన్ పాలనలో వైద్యరంగం పూర్వవైభవం పొందిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో వైద్యారోగ్యశాఖ ద్వారా అందుతున్న సేవలపై మాట్లాడారు. ప్రపంచంలోనే ఎక్కడాలేని విధంగా డా.వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరింత ప్రాధాన్యత ఇచ్చి మండలానికో 108, 104 వాహనాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. 3,500 రోగాలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెచ్చి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యభద్రత అందించారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం వైద్యరంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందని ద్రాక్షగా మార్చివేసిందని ప్రస్తుతం అమలవుతున్న వైద్య సేవలు గత టీడీపీ పాలనతో పోల్చుతూ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, అదనపు సిబ్బంది నియామకం, క్రమం తప్పకుండా మందుల సరఫరా, గ్రామ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు తదితర చర్యలద్వారా వైద్యాన్ని పేద, సామాన్యులకు అందుబాటులో ఉంచిందన్నారు.

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలి

గతేడాది గణపవరం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గణపవరం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేయాలని కోరగా ఆయన అంగీకరించారని దీనిని ఆచరణలోకి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గణపవరం పట్టణం చుట్టుపక్కల 60 గ్రామాలకు ప్రధాన కేంద్రంగా ఉందని ఇక్కడ సీహెచ్‌సీ ఏర్పాటు వల్ల ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. పూర్తిగా కొల్లేటి తీర ప్రాంతమైన నిడమర్రు మండలానికి వైద్యసేవలు అందించేందుకు ఇదొక్కటే ఆధారమన్నారు. ఇక్కడ కొత్త పీహెచ్‌సీ భవనం, సిబ్బంది క్వార్టర్లు నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈపీహెచ్‌సీకి దాతలు గతంలో రెండెకరాల భూమి దానంగా ఇచ్చారని, ఈభూమి అన్యాక్రాంతం కాకుండా ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. భీమడోలు మండలం ఆగడాలలంకలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల పది కొల్లేటి గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఈప్రాంతంవారు ఏచిన్న ఆరోగ్యసమస్య వచ్చినా 30 కిలోమీటర్ల దూరంలోని ఏలూరుకు వెళ్లవలసి వస్తోందన్నారు. ఈవిషయం ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, కొత్త పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నానన్నారు.

జగనన్న కాలనీల్లో పూర్తిస్థాయిలో వసతులు

పెదవేగి : జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టామని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు పి.విజయబాబు చెప్పారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. వచ్చే నవంబరు నెలాకరునాటికి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలని, ఈ విషయంలో అధికారులు, లబ్ధిదారులను చైతన్యపర్చాలని ఆయన సూచించారు. కాలనీల్లో అవసరమైన తాగునీరు, రహదారులు, విద్యుత్ లైన్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, ఎంపీడీవో జి.రాజమనోజ్, గృహ నిర్మాణశాఖ ఏఈ నాగరాజు, విజయరాయి, పెదవేగి, ముండూరు సొసైటీ అధ్యక్షుడు పాలడుగు సత్యనారాయణ, పెనుమాక వెంకట సుబ్బారావు, చెరుకూరి ప్రసాదరావు, సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్, వైఎస్పీ నాయకులు గుత్తా ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

కోలాహలంగా గణేశ్ విగ్రహాల నిమజ్జనం



దెందులూరులో తెలగ కాపు యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఊరేగింపు



పూళ్లలో 72 కేజీల లడ్డూను దక్కించుకున్న పెనుగొండ శ్రీనివాసరావు

దెందులూరు: దెందులూరులో మంగళవారం తెలగకాపు యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా యువత, పెద్దలు స్వామి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం కోలాహలంగా యువత నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి గోదావరి కాల్వలో స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

పూళ్లలో 72 కేజీల లడ్డూకు లాటరీ డ్రా

భీమడోలు: పూళ్లలో శ్రీ మద్గణపతి 72వ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. వైసీపీ నేత, మాజీ ఎంపీటీసీ పచ్చా బాబి ఆర్థిక సాయంతో స్వామి వారికి 72 కేజీల లడ్డూను స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. 72 కేజీల లడ్డూకు మంగళవారం లాటరీ పద్ధతిలో డ్రా తీసారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 330 మంది భక్తులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున కానుకగా చెల్లించి లాటరీలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పీఎంపీ, భక్తుడు పెనుగొండ శ్రీనివాసరావు విజేతగా నిలిచి లాటరీలో ఆ లడ్డూను దక్కించుకున్నాడు. లడ్డూ దక్కడంతో భక్తుడు సంతోషం వ్యక్తం చేసారు. అనంతరం లడ్డూను ఆయన స్వామి వారికి అందజేసారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు

ఉంగుటూరు: వర్తక సంఘం, ఆటో యూనియన్ సభ్యులు కలిసి ఉంగుటూరులో ఏర్పాటు చేసిన వినాయకుని ఉత్సవ కమిటీ పందిరి వద్ద అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని భోజనాలు చేశారు. కై కరం, చేబ్రోలు, బాదంపూడి తదితర గ్రామాల్లోనూ ఉత్సవాలు నిర్వహించారు.